నీనుండి' అనుట వలన - ఈకవిత - దేవీ ప్రసాద విశేలబ్ధమని స్ఫురింపఁజేయఁ బడుచున్నది. ' ఈ లోకమున సృజించుచున్న' దని అనుటచేత ' ఈ సృష్టి - అభినవము' అనునంశము – ద్యోతితము.

ము॥ దధానాస్సన్తోషం మనసి సుకవీనామతితరాం
దధానాః ప్రత్యగ్రం విబుధసదసే భావమలఘుమ్
కులానాముత్సాహం సపది విదధానా శ్శివవధూ
పరాణాం శోభన్తాం జగతి శిఖరిణ్యోగణపతేః॥ 25

రసాస్వాదననిపుణులును, నిర్మత్సరులును, అగు సత్కవుల మనస్సునందు సంతోషము నతిశయింపఁజేయునవియు, విద్వత్ పరిషత్తునకు – అనల్పమును, అభినవమును, అగు అభిప్రాయము నొసఁగునదియు, శివవధువగు భగవతియే ప్రధానముగాఁగల దేవీ భక్తుల యొక్క సంఘములకు వెంటనే యుత్సాహమును గూర్చునవియు, శిఖరిణీవృత్తములచే రచింపఁబడినవియు, అగు గణపతి కృతస్తుతులు – లోకమునందుద్దీపించుఁగాత!

ఇది - సవ్యాఖ్యమగు సప్తవింశ స్తబకము

* * * *



ఓం నమోభగవతే శ్రీరమణాయ

# ఉమాసహస్రము

## (సప్తమ శతకము – చతుర్థ స్తబకము)

## అష్టావింశ స్తబకము.

ము॥ అన్తర్వలక్ష పరిధి భ్రమమా దధానో
వక్త్రస్య పూర్ణతుహినద్యుతి మణ్డలస్య
హాసః కరోతు భవతాం పరమం ప్రమోదం
శుద్ధాన్త పఙ్కజదృశః ప్రమథేశ్వరస్య॥ 1

ప్రమథ గణముల కీశ్వరుఁడగు పరమశివుని యొక్క అంతఃపుర సుందరియగు పార్వతియొక్క వదనపూర్ణ చంద్రబింబమునకు చుట్టును, శుభ్రమగు పరివేషభ్రమము నుత్పాదించునదియగు, నామెహాసము – మీకు పరమానందము నొసఁగుఁగాత!

ప్రభ:- ముఖము చుట్టును గూడ – హాస ప్రభచేత మండలాకారమగు విలాసము గలదని స్ఫురింపఁజేయుటకు– ముఖచంద్రునికి హాసము – పరివేషము నావరించినట్లున్నదని చెప్పఁబడినది. అలంకారము – రూపకము.

ము॥ సమ్మోహనాని తుహినాంశు కలాధరస్య
సఞ్జీవనాని సరసీరుహ సాయకస్య
సన్దీపనాని వితనోతు జనేషుశక్తేః
సంహర్షణాని మమసన్తు శివాస్మితాని॥ 2

చంద్రకళాధరుఁడగు శివునికి సమ్మోహనములును, అరవింద బాణుఁడగు మదనునికి సంజీవనములును, వినతులగు భక్తజనుల శక్తికి సందీపనములును, అగు పార్వతీమందహసితములు – నాకు 'సంహర్షణములు' అగుఁగాత!

**ప్రభ:-** శివుని మోహింపఁజేయునవియు, హరనేత్రదగ్ధుఁడగు మన్మథుని జీవింపఁజేయునవియు; వినమ్రులగు భక్తులకు శక్తి నుత్తేజింపఁజేయునవియు, నగు పార్వతీస్మితములు – నాకు హర్షమును గలిగించుఁగాతమని భావము. ఇచట - పార్వతీఁ స్మితములకు – సమ్మోహన – సంజీవన – సందీపన – సంహర్షణత్వములు – 'అనేకములు' ఉల్లేఖింపఁబడుట వలన నిది యుల్లేఖాలంకారమగుచున్నది.

మూ॥ పాపానిమేహరతు కాచనకృత్తశీర్షా
మాతాపదామ్బుజ భుజిష్య వితీర్ణహర్షా
యాభక్తలోక వరదానవిధౌ వినిద్రా
వాసం కమణ్డలుధునీ పులినేకరోతి. 3

భక్తలోకమునకు వరముల నొసగుటయందు జాగరూకయగుచు, పావనమగు కమండలునదీ సైకత ప్రదేశమునందు నివసించునదియు, పదపద్మభుజిష్యమాణులకు (భక్తులకు) హర్షమునిచ్చునదియు, కృత్తశీర్షయు, (ఛిన్నశిరస్కయు) అనిర్వచనీయయు, అగు (రేణుకా) దేవి – నాపాపములను తొలఁగించుఁగాత!

**ప్రభ:-** ''యఃకుణ్డలీపట్టణ రాజధానీ'' (**25** స్త. **8** శ్లో) అను శ్లోకమున- ఏ క్షేత్రమున ప్రతిష్ఠియగు మూర్తి – స్తుతింపఁబడియెనో, ఆ క్షేత్రమునందే - కమండలునది యున్నది. కావున నచటనున్న రేణుకయే – యిచట కీర్తింపఁబడినదని గ్రహించునది. ఈ రేణుకా క్షేత్రమునందే – సంకట సమయమున దైవ ప్రేరణముచేత నైష్ఠికుఁడగునీకవి రేణుకాగీతమును గానమొనర్చెను. గీతమాలాంతర్గతమును, ఉజ్జ్వల ప్రతాపమును, అగు నిది – కాలాంతరమున ముద్రితమై యున్నది.



మూ॥ షష్ఠావతార జననావని రేకవీరా
భీమాధునోతు దురితాని గణాధిపస్య!
యాభక్తరక్షణ విధావతి జాగరూకా
పుణ్యేకమణ్డలు ధునీపులినే చకాస్తి॥ 4

భక్త జన రక్షణ విధియం దత్యంతమును సావధానయై, పవిత్రమగు కమండలు నదీపులినమున విరాజిల్లుచున్నదియు, షష్ఠావతారమగు పరశురామునికి జననభూమియు, ఏకవీరయు, (అద్వితీయ వీరయు) లేక, ' ఏకవీర' అను ప్రసిద్ధిగలదియు, భీమయు, (చండియు లేక భీమ అను నామమున విఖ్యాతయు) అగు దేవి– (రేణుక) గణపతి యొక్క పాపములను నివారించుఁగాత!

మూ॥ ఛేదాయచేద్ గతరజా మునిరాదిదేశ
ఛిచ్ఛేదచేద్ బహుగుణస్తనయః సవిత్రీమ్।
దాహ్యాం శరీరమఖిల ప్రభురీశశక్తి
ర్వ్యద్యావివేశచకథా పరమాద్భుతేయమ్. 5

రజోగుణ (క్రోధ) రహితుఁడగు జమదగ్నిముని (రేణుకా) శిరఃకర్తనము నాజ్ఞాపించిన యెడలను – అనేక సద్గుణవంతుఁడగు పుత్రుఁడు (పరశురాముడు) నిజమాతను ఛేదించిన యెడలను – సర్వేశ్వరియగు నీశ్వరశక్తి– దాహ్యమగు శరీరమునందు (మృతమగు కళేబరమగుట చేత దహింపఁదగిన దేహమునందు) ప్రవేశించిన యెడలను – ఈ కథ – పరమాద్భుతమే యగును.

**ప్రభ:-** సాత్త్వికుఁడగుట చేత – శాంతుఁడగు మునికి – క్రోధమును, పుత్రునకు – మాతృశిరచ్ఛేదమును, ఈశ్వరశక్తికి – మృతశరీర ప్రవేశమును, సంభవించు నెడల నిది పరమాశ్చర్యకరమని భావము.

మూ॥ పుత్రః ప్రియస్తవ శిరః సహసాచకర్త
కృత్తాచ హర్షభరితా భవతీ ననర్త
నోతస్య పాపమపి నోతవకాऽపిహాని
ర్నాశోऽస్య హా భుజభువా మభవద్ విపాకః॥ 6

ప్రియపుత్రుఁడగు పరశురాముఁడు – అవిచారితముగా నీ శీర్షమును ఖండించెను. నీవో, ఖండింపఁబడినదానవైనను, ఆనందపూరితవై నృత్తము నొనర్చితివి. అతనికి మాతృవధవలన పాపము కలుగదయ్యెను. నీకుఁగూడ శిరచ్ఛేదము వలన హానియేదియుఁ గలుగలేదు. కాని ఈ ఘోరకర్మము - భుజభువులగు క్షత్రియులకు వినాశముగాఁ బరిణమించెను! ఆశ్చర్యము!

ప్రభ:- ఈ కథ – అసంభవముగాఁ దోచుచున్నదని భావము.

మూ॥ అమ్బైవ సా సురభి దర్జున భూపతిర్యాం
వీర్యాజ్జహార సచభార్గవ ఆజహార।
తస్యాహతేః పరగృహస్థితి రేవ హేతుః
గన్ధర్వదర్శనకథా రిపుకల్పితైవ॥ 7

ఆ కామధేనువు – అంబయే. ఆమెనే అర్జునమహారాజు ( కార్త్య వీర్యుఁడు) వీర్యము వలన హరించెను. ఆమెనే భార్గవుఁడగు పరశు రాముఁడు తీసికొనివచ్చెను. పర (శత్రు) గృహనివాసమే – పరశురాముఁడాయమ్మను చంపుటకు హేతువు. గంధర్వదర్శన కథ – (రేణుకాదేవి గంధర్వునిఁ జూచి మోహము నొందినదను గాథ) (భార్గవ) శత్రువుల చేత కల్పింపఁబడినదియే యగును.

ప్రభ:- కార్తవీర్యార్జునుని చేత – బలశక్తి చేత– అపహరింపఁబడి – మరల పరశురామునిచేఁ దీనికొనిరాఁబడినది. – కామధేనువు కాదు. ఆమె రేణుకాంబయేయగును. జమదగ్ని యామెను వధింపుమనుటకు గారణము -



ఆయమ్మ – పరగృహము నందుఁ గొంతకాలము వసించుటయే కాని యింకొకటి కాదు. ఒక గంధర్వుని జూచి మోహిత యగుట చేత అపరాద్ధయగు రేణుకను జంపుటకు జమదగ్ని – ఆజ్ఞాపించెనను గాథ భార్గవశత్రువుల చేత కల్పింఁబడినది కాని యథార్థము గానేరదు. ఈ సమన్వయము. నవీనులకు సమీక్ష్యార్థము.

మూ॥ ఛిన్నానినోకతి శరీరభృతాం శిరాంసి
తత్ పూజ్యతేజగతి రైణుకమేవ శీర్షమ్।
కృత్తాః కళేబరవతాం కతినాభయోన
చేతోధినోతి సురభిర్మృగనాభిరేకః॥ 8

దేహధారులకు శిరస్సు లెన్ని ఛిన్నములు కాలేదు? (అనేక శిరస్సులు ఛేదింపఁబడుచున్నవి) అయినను వానియందు, రేణుకకు సంబంధించిన (రైణుకమగు) ఆశిరస్సొక్కటియే – లోకమునందు పూజింపఁబడుచున్నది. శరీరులగు జంతువుల నాభులు – (మధ్యవర్త్యులగు బొడ్డులు) ఎన్నికృత్తములు కాలేదు? అయినను వానియందు కస్తూరి కామృగనాభియొక్కటియే – మనస్సును తృప్తినొందించుచున్నది.

మూ॥ ప్రాణావసన్తి శిరసారహితే శరీరే
లీలాసరోజతిశరస్తుకరేऽస్యకృత్తమ్
తన్నిఘ్నమేతదఖిలంచ ధియైవధీరాః
పశ్యన్తునన్దనగరే తదిదం విచిత్రమ్॥ 9

శిరోహీనమగు దేహము నందు ప్రాణములు వసించుచున్నవి. ఈ శరీరమునకు సంబంధించిన హస్తము నందు – ఖండితమగు శిరస్సు లీలార్థమగు సరోజము వలె నాచరించుచున్నది. ఈ విశ్వమంతయుఁగూడ – హస్తముచే ధరింపఁబడిన శిరస్సుగల మొండెమునకు – అధీనమగుచున్నది. నందనగరము నందు (కుండలీ పత్తనము నందు) గల ఆ యీ విచిత్రమును (అద్భుతమును) ధీరులు – బుద్ధిచేతనే విచారింతురుగాత!

**ప్రభ:-** పూర్వము వర్ణింపఁబడిన కుండలీపురమను క్షేత్రమునందు మీఁద దెలుపఁబడిన రూపము గల రేణుకామూర్తి – పూజింపఁబడుచున్నది. ''ధీరులు బుద్ధి చేతనే విచారింతురు గాత!'' అనుటచేత దశమహావిద్యలయందు ప్రసిద్ధయగు ఛిన్నమస్తయొక్క గూఢతత్త్వము – ఈ విచిత్ర రూప వర్ణనము చేత – విద్వాంసులకు విదితమగునని అభిప్రాయము. ఇంకొకచోట ప్రచండ చండీ ప్రస్తావము నందుఁ గూడ– ఈ యంశము ప్రతిపాదింపఁబడినది.

మూ॥ ప్రాణేశ్వరీ విధిపురే లసతః పురారే
రఙ్గీకరోతు శరణాగతి మమ్బికామే।
లబ్ధం నిపీయ యదురోరుహకుమ్బదుగ్ధమ్।
సమ్బన్ధమూర్తి రభవత్ కవిచక్రవర్తీ॥ 10

ఏ యంబిక యొక్క ఉరోజఘటముల యందలి స్తన్యమును గ్రోలి (జ్ఞాన) సంబంధమూర్తియను శైవసమయాచార్యుడు – కవి చక్రవర్తియయ్యెనో, బ్రహ్మపురమునందు విలసిల్లుచున్న శివుని యొక్క ప్రాణేశ్వరియగు నాయంబిక- నా శరణాగతిని (ప్రపత్తిని) అంగీకరించుగాత!

**ప్రభ:-** చోళ దేశము నందున్న బ్రహ్మపురము – సంబంధమూర్తికి - జన్మక్షేత్రము. ''మూడు సంవత్సరములు మాత్రమే వయస్సు గల బాలుఁడగు సంబంధమూర్తి దేవార్ (తేవార్) అను పేరుగల ద్రవిడ వేద ప్రబంధమును నిర్మించి – శివునారాధించెను. భగవతియగు నంబిక – అతనికి స్తన్యము నొసఁగెను. తన్మహిమయే –తదీయమగు వాగ్విలాసము.'' అని యైతిహ్యము గలదు. ఈ స్థలము ద్రవిడ దేశమున ''శీర్గాళి' అని ప్రసిద్ధము.

మూ॥ అప్రాప్యలోక రచనావన పాతనేషు
యస్యాత్రయోఽపి పురుషాః కరుణా కటాక్షమ్
నై వేశతే కిమపి సా జగదేకమాతా
భద్రాపరాప్రకృతి రస్త్వఘనాశినీ నః. 11



బ్రహ్మ – విష్ణు – రుద్రులను, పురుషులు ముగ్గురును – లోకసృష్టి – రక్షణ – సంహారముల యందు – ఏ దేవత యొక్క కరుణా పూర్ణమగు నేత్రాంతదర్శనము లభింపక, సృష్ట్యాదికర్మమును దేనిని గూడ చేయుటకు శక్తులుకారో, ఆ జగదేకమాతయు, మంగళయు, అగుపర ప్రకృతి (భగవతియగు - మూలప్రకృతి- మహామాయ) మాయొక్క పాపములను విధ్వంసము నొనర్చుగాత!

**ప్రభ:-** 'పాపనాశ'మను, చోల దేశ క్షేత్రము గలదు. అచట విరాజమానయగు మూర్తి – స్తుతింపఁబడినది.

మూ॥ రక్తాప్రబోధ శశినో హృదయోదయస్య
నైకావిపజ్జలనిధౌ పతతాం జనానామ్
వేదధ్వజస్య లలితా త్రిరుచిః పతాకా
కాచిన్మమాస్తు శరణం శివమూలటీకా. 12

హృదయ (సాగర) ము నుండి యుదయించిన ప్రబోధ (జ్ఞాన) చంద్రునికి– రాకయు, (పూర్ణిమయు) ఆపత్ సముద్రము నందు మునిగిన జనులకు–నౌకయు, (తారిణియు) వేదధ్వజుఁడగు (వేదములు, కేతనముగాఁ గలిగి వేదగిరీశుఁడని ప్రసిద్ధుఁడై, కాంచీ మండలమునందున్న క్షేత్ర విశేషమున కధిష్ఠాతయైయున్న) యీశ్వరునికి– (లోహితశుక్ల కృష్ణములగు రజస్సత్త్వతమః ప్రభల చేత) త్రిరుచియగు పతాకయు, (వైజయంతియు) శివమూలటీకయు, (దురవగాహమగు సూత్రమునకు టీకవలె, శివుఁడను మూలస్వరూపమును ప్రకాశింపఁజేయునదియు) అనిర్వచనీయయు అగు లలితా (త్రిపురసుందరీ) దేవీ– నాకు శరణమగుఁగాత!

**ప్రభ:-** కాంచీమండలమునందున్న వేదగిరి క్షేత్రమున కధీశ్వరియగు నంబికకు 'త్రిపురసుందరి' అనునామము ప్రసిద్ధమగుచున్నది. ఆయమ్మ –

హృదయము నుండి జ్ఞానమును వికసింపఁజేయుచు, ఆపద నుండి దాటించుచు, రజస్సత్త్వతమః ప్రభలను వెలయించుచు, శివరహస్యమును ప్రకాశింపఁజేయు చుండును. ఆ లలితా త్రిపుర సుందరీ దేవి నన్ను రక్షించుఁగాతమని తాత్పర్యము. (ఇచట - లలిత - రాకా, నౌకా, పతాకా, టీకా, భేద రూపమున నారోపింపఁ బడినది. కావున రూపకమలం కారమగుచున్నది. మఱియు, రాకాదిరూపముల ననేకముగ నుల్లేఖింపఁబడుట వలన రూపక శిరస్కమగు ఉల్లేఖము గూడ నలంకారమగుచున్నది.

మూ॥ మౌలౌ మహేంద్ర సుదృశస్సుమనోనికాయ
సంశోభితే సదసిమాన్య ఇవాభిజాతః।
రేణుశ్చ యచ్చరణభూర్లభతేఽ గ్రపీఠమ్
త్రాణాయసాభవతు భూత పతేర్వధూర్నః॥ 13

ఏ దేవి యొక్క చరణముల నుండి యుద్భవించిన రేణువు కూడ - సుమనోనికాయ (పుష్ప సమూహ) సంశోభితమగు మహేంద్ర సుందరీ మౌళియందు, సుమనోనికాయ (శుద్ధమనస్కులగు దేవతల యొక్క సమూహము చేత) సంశోభితమగు సభయందు మాన్యమగు (పూజ్యమగు) సత్కులజుఁడు వలె, అగ్రపీఠమును (ప్రథమాసనమును) పొందుచుండునో, భూతపతియగు రుద్రుని వధువగునా దేవి - మమ్ము రక్షించుఁగాత!

**ప్రభ:-** భగవతీ చరణ రేణువు మహేంద్ర సుందరీ చూడయందు పూజ్యమగు స్థానము నొందుఁగాత! అని భావము. సుమనశ్శబ్దము, పుష్పములను - దేవతలను, దెలుపుట చేత - శ్లిష్టమని వ్యాఖ్యానింపఁబడినది. అలంకారము - పూర్ణోపమ.

మూ॥ అమ్బా వృణోతి పరితోఽప్యయ మన్ధకారో
నాత్మానమేవ మమకింతు కులంచ దేశమ్।
శీఘ్రం మదీయ హృదయోదయ పర్వతాగ్రే
శ్రీమానుదేతు తవ పాద మయూఖమాలీ॥ 14



అమ్మా! ఈ చీకటి - (పోఁదగిన బాటయొక్క ప్రకాశము నావరించునది యగు అజ్ఞానము) కేవలమగు నాయాత్మనేగాక మానుష సంఘమును, భారతదేశమును గూడ - అంతటను ఆవరించుచున్నది. మదీయ హృదయమను ఉదయాద్రి యొక్క శిఖరము నందు శ్రీమంతమగు (పాదపక్షమున - లక్ష్మీవంతమును, సూర్య పక్షమున - రోచిష్మంతమును అగు) పాదమను సూర్యుఁడు - శీఘ్రముగా నుదయించుఁగాత!

**ప్రభ:-** ''నన్నును, (భారతీయ) మానవ సంఘమును, మా దేశమును, గూడ పూర్ణముగా నావరించియున్న శ్రీ రహితమగు నంధకారమును నివారించుటకు భగవతీ పాదమే - సమర్థము.'' అను వస్తువు - హృదయమును - ఉదయ పర్వతము గను, పాదమును - సూర్యునిగను ఆరోపించునదియగు రూపకము చేత - అనుప్రాణితమగుచున్నది.

మూ॥ కష్టం ధునోతుమమ పర్వత పుత్రికాయాః
ప్రత్యగ్రపఙ్కరుహ బాన్ధవకాన్తికాన్తమ్।
అమ్భోరుహాసన ముఖామరమౌలిరత్న
జ్యోతిర్వి శేషితగుణం చరణారవిన్దమ్. 15

కమల బాంధవుఁడగు బాలార్కుని కాంతివలె కాంతివంతమును, కమలాసన ప్రభృతులగు అమరుల మౌలుల యందలి రత్నముల జ్యోతుల చేత ప్రకాశించుచున్న (పావిత్ర్యాది) గుణము గలదియు, అగుపర్వత కుమారియొక్క చరణ పద్మము - నా కష్టమును తొలఁగించుఁగాత!

మూ॥ వ్యాశిక్షితాని సమరే గిరిశంజిగీషోః
కామస్య హంసనివహస్య నిమన్త్రణాని।
ధున్వన్తుమే దురిత మద్రికుమారి కాయాః
పాదారవిన్ద కటకక్వణితాని తాని॥ 16

యుద్ధము నందు గిరిశుని జయింపఁగోరిన కామునకు జ్యాశింజితములును, (వింటినారి యొక్క ధ్వనులును) హంస నివహమునకు నిమంత్రణములును, పార్వతీయములును, అగు ' ఆ' పాదారవిందకటక క్వణితములు – నా దురితమును తొలఁగించుఁగాత!

ప్రభ:- దేవి యొక్క కాలియందెల రొదలు – శివుని వశీకరించుకొనఁగోరిన మదనునకు ధనుర్జ్యానినాదములవలెను గమనమును నేర్పుటకు హంసలను పిలుచునవివలెను, ధ్వనించుచుండునని భావము. ''ఆ'' = అనిర్వచనీయములగు ధ్వనులు.

మూ॥ యః సర్వలోక మథనం మహిషం జిగాయ
యస్త్రైవకర్మ దమనంచ తదన్తకస్య
నారీనరాకృతి భృతో మహసస్తమ(జ్జీం
మఞ్జీరనాదమధురం శరణం వ్రజామి. 17

ఏ పాదము – సర్వలోకములను మథించుచున్న మహిషుని జయించెనో, ఏ పాదము యొక్క మహిషవిజయ రూపమగు 'ఆ' కర్మ – అంతకుని (యముని) గూడ – నిగ్రహించినదయ్యెనో, స్త్రీ పురుషాకారధారిణి యగు జ్యోతిస్సుయొక్క- మంజీర నాదమధురమగు ఆపాదమును – శరణముగా నొందుచున్నాను.

ప్రభ:-''యమునకుఁగూడ – జయింపశక్యము కాని మహిషుని జయించుట వలన – పాదకృతమగు మహిష ధ్వంసకర్మము చేత - అంతకుఁడుగూడ – జయింపఁబడియె''నను నర్థాపత్తి సిద్ధించుచున్నది. స్త్రీ- పురుషరూపధారియగు జ్యోతిస్సన అర్ధనారీశ్వర స్వరూపమని గ్రహించునది.

మూ॥ ఆపన్మ హాో గ్రవిషరాశి నిమగ్న మేతం
దీనం త్వదీయ చరణం శరణం ప్రపన్నమ్
ఉద్ధర్తుమమ్బ! కరుణాపరిపూర్ణచిత్తే!
విత్తేశమిత్రకులనారి! తవైవభారః 18



ధనాధిపమిత్రుఁడగు శివుని కులాంగనవగు జననీ! కరుణాపరిపూర్ణహృదయా! ఆపదయను మహా ఘోర విష సాగరమునందు మునిఁగినవాఁడను, నీ చరణమును శరణము నొందిన వాఁడను, దీనుఁడను అగు ఈ నన్నుద్ధరించుటకు నీదియే భారము.

ప్రభ:- 'దీనుఁడనగు నేను – త్వదేక శరణుఁడ' నని భావము.

మూ॥ లోకాధిరాజ్ఞి! పతితం విపదన్ధకూపే
సంరుద్ధదృష్టి మభితస్తిమిరచ్ఛటాభిః
మాతః! సముద్ధరకృపాకలితే! మృడాని!
పుత్రం కరేణ జగతామభయఙ్కరేణ॥ 19

జగదధీశ్వరీ! దయాకలితా! మృడానీ! ఆపదంధకూపమున (ఆపదయను తమోవ్యాప్తమగు నూతియందు) పడియున్నవాఁడను, తిమిరచ్ఛటల చేత నివారింపఁబడిన దృష్టిగలవాఁడును, పుత్రుఁడను, అగునన్ను లోకముల కభయంకరమగు హస్తము చేత – సముద్ధరింపుము. (వెలుతురులోనికిఁ దీసికొనిరమ్ము).

మూ॥ అస్య త్వదీయపదపఙ్కజకిఙ్కరస్య
దుర్భాగ్యపాక విఫలీకృతపౌరుషస్య
ప్రాణేశ్వరీ ప్రమథలోకపతే రుపాయం
వీక్షస్వతారణ విధౌనిపుణే! త్వమేవ॥ 20

ప్రమథ లోకపతియగు శివునికి ప్రాణేశ్వరివగు పార్వతీ! త్వదీయ పదారవింద భక్తుఁడను, దుర్భాగ్యపరిణామము చేత విఫలముగాఁ జేయఁబడిన పురుషకారముగల వాఁడను అగు నన్ను తరింపఁజేయుటకుపాయమును నిపుణురాలవగు నీవే పరికింపుము.

ప్రభ:- పురుష ప్రయత్నమును జయించిన దైవమును – జయించుటకు తగినయుపాయమును ప్రసన్నురాలవగు నీవే చూడవలయునని భావము.

మూ॥ మృత్యుఞ్జయోరుమణి పీఠతటే నిషణ్ణే!
తాటఙ్క కాన్తి బహులీకృత గణ్డశోభే!
మాణిక్య కఙ్కణలసత్ కరవారిజాతే!
జాతే కులాచలప తేర్జహిపాతకం నః॥ 21

మృత్యుంజయుఁడగు శివుని – వామోరువను మణిమయ పీఠ తటమునం దాసీనురాలవును, తాటంకములను కర్ణాభరణముల యొక్క కాంతులచేత బహులముగాఁ జేయబడిన కపోల శోభగలదానవును, మాణిక్యఖచితములగు వలయము చేత – శోభించుచున్న హస్తకమలము గలదానవును, కులా చలపతి పుత్రికవును, అగుజననీ! మాపాపములను నశింపఁజేయుము.

మూ॥ కింతే వపుర్జనని తప్తసువర్ణగౌరం
కామారిమోహిని కి మిన్దుకలావలక్షమ్
పాకారినీలమణి మేచక కాన్త్యుతాహో
బన్ధూకపుష్పకలికా రుచివా స్మరామి॥ 22

జననీ! శివ సమ్మోహినీ! తప్త సువర్ణగౌరమగు నీ శరీరమును స్మరింతునా? చంద్రకలాధవలమగు నీ శరీరమును స్మరింతునా? లేక ఇంద్రనీలమణి శ్యామల కాంతియగు నీ శరీరమును స్మరింతునా? బంధూక పుష్పకలికారుచియగు నీ శరీరమును స్మరింతునా?

ప్రభ:- ఏ వర్ణము గల నీవు నాకు ధ్యానగోచర వగుదువని నాలుగు రంగులు గల మూర్తులనుదాహరించి యడుగుచున్నాఁడు. పుటము పెట్టఁబడిన బంగారము వలె పచ్చని రంగుగల గౌరీమూర్తినా? సోమకలాధవలమగు సరస్వతీమూర్తినా? లేక ఇంద్రనీలాభమగు కాలీమూర్తినా? బంధూకకోరకము (మంకెన పూవుయొక్క మొగ్గ) వలె నరుణవర్ణము గల లక్ష్మీమూర్తినా? నన్ను ధ్యానింపు మందువని ప్రశ్న. బహుమూర్తి భేదములుగ దేవియొక్కతియే – గుణభేద – ఫలభేదముల



హవిష్కరించుటకు, సమర్థురాలగుచున్నది. కావున నిట్లు ప్రశ్నింపఁబడినది. 'తప్త సువర్ణవర్ణా' అను నింకొక పాఠము గూడఁగలదు. దశమహా విద్యారూపిణియగు భగవతిని రెండు శ్లోకముల చేత వ్యాఖ్యానించుచున్నాఁడు.

మూ॥ త్వం సున్దరీ నృపతిజాతి జిత స్త్వమమ్బా
ధూమావతీ త్వమజరే భువనేశ్వరీ త్వమ్
కాలీత్వమీశ్వరి శుకార్భకధారిణీత్వం
తారాత్వ మాశ్రిత విపద్దల నాసిధారా. 23

నీవు త్రిపుర సుందరివి. నీవు క్షత్రియజాతిని జయించిన పరశురామునకు మాతవగు రేణుకవు. (ఛిన్నమస్తవు) అజరవగు నీవు ధూమావతివి. (జ్యేష్ఠవు) ఈశ్వరీ! నీవు భువనేశ్వరివి. (దక్షిణకాలివి) నీవు శుకబాలుని హస్తమున ధరించిన శ్యామలవు. (మాతంగివి) నీవే– ఆశ్రితజనుల ఆపదలను ఛేదించు ఖడ్గధారగల తారాదేవివి.

ప్రభ:-త్రిపుర సుందరీ దేవినే – శ్రీ విద్యా రూపిణియని చెప్పుదురు. ధూమావతినే – ధూమ్రవారాహీదేవియని చెప్పుదురు. నీల, సరస్వతి, ఏకజట, అనుమూర్తులు తారా దేవి భేదములని గ్రహించునది. (ఇందు 6 మూర్తులు చెప్పఁబడినవి.)

మూ॥ త్వం భైరవీ భగవతీ బగలాముఖిత్వం
రామాచ సా కమల కానన చారిణీత్వమ్।
కైలాసవాసి నయనామృతభానురేఖే
కోవేదతే జనని! జన్మవతాం విభూతీః, 24

నీవు భగవతివగు భైరవివి. (త్రిపుర భైరవివి) నీవు – బగలాముఖివి. (సర్ప స్తమ్భనకరివి, పీతవర్ణవు. అగు బకముఖివి) కమలవన సంచారిణివగు లక్ష్మివి నీవే. కైలాసవాసియగు శివుని నయనములకు అమృతభాను (చంద్ర) రేఖవును, ప్రాణులకు మాతవును, అగు నీ విభూతుల నెవ్వఁడు తెలియఁగలడు?

* * *

ప్రభ:- ఇట్లు – దశమహా విద్యామూర్తులను తెలిపి – అసంఖ్యాకములగు నీ విభూతుల నెవ్వఁడును తెలియఁజాలఁడని చెప్పఁబడినది. ( ఇందు 4 మూర్తులు చెప్పఁబడినవి. )

మూ॥ ధున్వన్తు సర్వవిపదః సుకృత ప్రియాణాం
ధున్వన్తు చాఖిల సుఖాన్యఘలాలసానామ్।
అవర్జ్యభూరి కరుణం పురజిత్ తరుణ్యా
శ్చిత్తం వసన్త తిలకాః కవిభర్తు రేతాః॥ 25

కవీశ్వరుఁడగు గణపతి చేత రచితములును, వసంతతిలకా వృత్త నిబద్ధములును, అగు ఈ స్తుతులు – శివ సుందరియగు పార్వతి యొక్క విస్తారమగు కరుణ గల హృదయమును నాకర్షించి సుకృత ప్రియులగు సాధుజనుల యాపదలనన్నింటిని ధ్వంసము చేయుఁగాత! దుష్కృతముల యందభిలాషము గల దుర్జనుల సుఖముల నన్నిఁటిని తొలఁగించుఁగాత!

ఇతి శ్రీ మహర్షి రమణ భగవత్ పాదాన్తేవాసినో వాసిష్ఠస్య నరసింహ సూనో.
గణపతిమునేః కృతావుమా సహస్రే అష్టావింశః స్తబకః సమాప్తః

ఇది శ్రీ మహర్షి రమణ భగవత్ పాద శిష్యుఁడు, శరపర్ణ సగోత్రుఁడు, శ్రీమత్ పంతుల
వేంయశాస్త్రి పౌత్రుఁడు, వేంకటరామ బుధేంద్ర పుత్రుఁడు,
లక్ష్మీనారాయణ శాస్త్రిచే నాంధ్రీకరింపఁబడిన ఉమాసహస్రమను స్తోత్రకావ్యమున ఇరువది నెనిమిదవ స్తబకము. (సప్తమ శతకము) సమాప్తము.

****



ఓం నమోభగవతే శ్రీరమణాయ

# ఉమాసహస్రము

## ( ఎనిమిదవ శతకము – ప్రథమ స్తబకము )

### ఏకోనత్రింశ స్తబకము

అవ:- ఇరువది తొమ్మిదవ స్తబకమున నవవిధమగు భజనము ప్రస్తావింపఁబడుచున్నది.

మూ॥ ఆయుష్యాభువనానాం చక్షుష్యాస్త్రిపురారేః
కుర్వన్తు ప్రమదంనః పార్వత్యాః స్మితలేశాః॥ 1

లోకుల యొక్క జీవనమే ప్రయోజనముగాఁ గలవియు, త్రిపురారియగు శివుని నేత్రమునకు హితములయినవియు, అగు పార్వతీ దేవి యొక్క స్మితలేశములు– మాకు హర్షమును గూర్చుఁగాత!

ప్రభ:- ''సకలభువన జీవనార్థములును, శివనయన తర్పకములును, పార్వతీ మందహాసములును – మాకు ప్రమోదమునిచ్చుఁగాత!'' అని యర్థము.

మూ॥ నాత్యర్థాణి నిరర్థం నేతవ్యాని దినాని
అమ్బాయాశ్చరితాని శ్రోతవ్యా న్యనఘాని॥ 2

మిక్కిలి వెలగలవియగు దినములు – నిష్ప్రయోజనముగా గడుపఁగూడదు. పావనములగు జగన్మాత యొక్క చరిత్రములు వినవలయును.